కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం

- ప్రజాస్వామ్యాన్నే కొంటారట..!
- మాటలు మార్చేటోళ్లకు ఓటేస్తే ప్రజలు ఓడుతారు..
- ఓడిపోయి ఇంట్లో కూర్చున్న తుమ్మలకు మంత్రి పదవిచ్చా..
- కమ్యూనిస్టులు పాలించిన చైతన్యవంత ప్రాంతం ఇదీ..
- ప్రజా ఆశీర్వాద సభల్లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాంరాం.. కైలాసం వైకుంఠపాళి ఆటలో పెద్దపాము మింగినట్టే..! పదవుల కోసం పార్టీలు మారుతున్నారు.. జిల్లాలో నాయకులు డబ్బుల అహంకారంతో మాట్లాడుతున్నారు. కమ్యూనిస్టు ఎమ్మెల్యేల ఏలుబడిలో చైతన్యవంతమైన ప్రాంతం ఇదీ.. మాటలు మార్చేటోళ్లకు ఓట్లేస్తే ప్రజలు ఓడుతారు.. డబ్బు మదంతో ప్రజలను, ప్రజాస్వామ్యాన్నే కొంటామంటున్నారు. తుమ్మల ఎమ్మెల్యేగా ఓడిపోయి ఇంట్లో కూర్చుంటే నేను ఎమ్మెల్సీని చేసి, మంత్రి పదవిచ్చా..." అంటూ కాంగ్రెస్ నేతలపై ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. ప్రధాని మోడీ స్వరాష్ట్రంలోనూ 24 గంటల కరెంటు లేదని, సాగుకు, పరిశ్రమలకు 24 గంటలపాటు కరెంటునిచ్చేది కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనన్నారు. శుక్రవారం మహబూబాబాద్, వర్ధన్నపేట పాలేరు నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్ మాట్లాడారు.

పాలేరు నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యరి కందాల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కెసిఆర్ ప్రసంగించారు. కందాల ఉపేందర్‌రెడ్డిని అసెంబ్లీ వాకిలి దాటిస్తే పాలేరు నియోజకవర్గం మొత్తానికి దళితబంధు అమలు చేస్తానని హామీ ఇచ్చారు. కోట్లు, నోట్లు పెట్టుకొని వచ్చేటోడు ఏమి చేయడు..? సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే బిఆర్ఎస్‌కు ఓటేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు కెసిఆర్ విజ్ఞప్తి చేశారు. రైతుబంధు అనే పదాన్ని పుట్టించింది తామేనని, ఈ పథకాన్ని వ్యవసాయ నిపుణులు స్వామినాథన్, ఐక్యరాజ్యసమితి ప్రశంసించాయని గుర్తు చేశారు. కానీ రైతుబంధు దుబారా..!, వేస్టు అని మాజీ టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటుంటే.. ప్రస్తుత టిపిసిసి అధ్యక్షులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలంటున్నారు. ఇది కరెక్టేనా అని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తే కరువు తొంగిచూడదన్నారు. ఇన్నాళ్లు ఎవరైనా దళితబంధు ఆలోచన చేశారా అని ప్రశ్నించారు. ప్రతి తండాను పంచాయతీని చేయడంతో వాళ్ల తండాల్లో వాళ్లే రాజ్యం చేస్తున్నారని చెప్పారు. గిరిజనులకు పోడుపట్టాలు పంపిణీ చేసి, వాళ్లపై పెట్టిన కేసులు ఎత్తివేశామన్నారు. అలాంటిది కాంగ్రెస్ నాయకులు రూ.వెయ్యి ఇచ్చి, గుడుంబా పోస్తే లంబాడోళ్లు ఓట్లు వేస్తారని గిరిజనులను చులకన చేసి మాట్లాడుతున్నారన్నారు. గత రెండు పర్యాయాలు ఖమ్మం జిల్లా ప్రాతినిధ్యం లేకుండానే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, ఈసారి అలాకాకుండా బిఆర్ఎస్ అన్ని స్థానాల్లో గెలిచేలా కృషి చేయాలని కెసిఆర్ పిలుపునిచ్చారు. ఇంటి మనిషిలా మీలో ఒక్కడిగా ఉన్న కందాల ఉపేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సభలో బిఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, వైరా బిఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్, ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో జరిగిన 'ప్రజా ఆశీర్వాద సభ'లో సిఎం మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోసమే కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో వర్ధన్నపేటలో ఎస్ఆర్‌సిపి కాలువల్లో చెట్లు మొలిచి అధ్వాన్నంగా ఉండేవని, ఇప్పుడు ఐనవోలు, హసన్‌పర్తి మండలాలకు దేవాదుల ప్రాజెక్టు నీరు తీసుకొచ్చామని తెలిపారు. రింగ్ రోడ్డు కోసం ల్యాండ్ పూలింగ్ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, అరూరి రమేష్‌ను నేరుగా ఓడించడం చేతకాని వాళ్లు చేస్తున్న పనని, ల్యాండ్ పూలింగ్ ఏమి ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఫించన్‌ను మార్చి నెల అనంతరం సంవత్సరానికి రూ.500ల చొప్పున పెంచుతూ రూ.5,016కు పెంచుతామన్నారు. వచ్చే మార్చి తరువాత రేషన్‌కార్డులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ఉన్న 42 విలీన గ్రామాల్లో సాదాబైనామాలను రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఎన్నికల అనంతరం ఇస్తామని హామీనిచ్చారు. రైతు, సంక్షేమ రాజ్యాంగా రాష్ట్రాన్ని తీర్చి దిద్దుకున్నామన్నారు. మంత్రి దయాకర్‌రావు, మాజీ మంత్రి కడియం శ్రీహరిలది కూడా వర్ధన్నపేట నియోజకవర్గమేనని, వారిద్దరి ఆశీస్సులు అరూరి రమేష్‌కు ఉన్నాయన్నారు. కాగా, సిఎం కెసిఆర్ ప్రసంగం సభికులను ఆకట్టుకోలేకపోవడంతో ప్రజలు తిరిగి వెళ్లిపోవడం గమనార్హం. దాంతో సభ 15 నిమిషాల్లోనే ముగించారు.

మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు రహదారిలోని సభలో సిఎం మాట్లాడుతూ ధరణి, రైతుబంధు వద్దంటున్న ఆ నలుగురు రాహుల్‌గాంధీ, ఉత్తమ కుమార్ రెడ్డి, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలను బంగాళాఖాతంలో కలిపేయాలన్నారు. ఎవరో వచ్చారని ఏదో చెప్పారని, లీడర్ చెప్పారని, బామ్మర్ది చెప్పాడని ఓటు వేయవద్దని, గాబరా పడొద్దని, గోల్‌మాల్ కావొద్దని ఆలోచించి ఓటు వేయండని, తెలంగాణను దళార్లపాలు పైరవీకార్ల పాలు చేయొద్దని, పనిచేసే ప్రభుత్వానికి పట్టంకట్టాలని కోరారు. రైతుబంధు 4000తో స్టార్ట్ చేసి భవిష్యత్తులో 16,000 ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. సభలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఛీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపి దయాకర్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యే నరేందర్, డిసిసిబి చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఏడుస్థానాల్లో న్యూడెమోక్రసీ అభ్యర్థుల పోటీ

- మిగతా స్థానాల్లో ప్రజాస్వామ్యవాదులు, కమ్యూనిస్టు విప్లవకారులకు మద్దతు
- న్యూడెమోక్రసీ పార్టీల నేతలు సాధినేని వెంకటేశ్వరరావు, ఎ మధు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారపి, మిగతా స్థానాల్లో ప్రజాస్వామ్యవాదులకు, కమ్యూనిస్టు విప్లవకారులకు మద్దతు తెలుపుతామని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రెండు పార్టీలు సంయుక్తంగా ప్రకటించాయి. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీల రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడారు. ఇల్లందు(ఎస్‌టి)- మోకాళ్ల కృష్ణ, పినపాక (ఎస్‌టి)-ఈసం కృష్ణ, మహబూబాబాద్ (ఎస్‌టి) బట్టు భిన్నమ్మ, ములుగు (ఎస్‌టి)-సమ్మక్క, నర్సంపేట-మొగిలి ప్రతాప్‌రెడ్డి, మంచిర్యాల-అందె మంగ, నిజామాబాద్ అర్బన్-మసాల్కర్ శివకుమార్ తమ అభ్యర్థులుగా పోటీచేస్తారని తెలిపారు. వారిని గెలిపించాలని ప్రజలను కోరారు. తెలంగాణ వనరులను, సహజ సంపదలను కాపాడుకునేందుకు, దున్నేవాడికే భూమి దక్కాలని పోరాటం చేయడం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. కేంద్రంలోని బిజెపి హిందూత్వ సర్కారు మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించే గొంతుల్ని నొక్కేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తోందన్నారు. ఆటవీ సంరక్షణ నియమాల పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టి సహజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే పనిలో బిజెపి ఉందని విమర్శించారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని, బిల్లులు, చట్టాల రూపకల్పన, కీలక సమయాల్లో ఆ రెండు పార్టీలూ పరస్పరం మద్దతు తెలుపుకున్నాయని పలు ఉదంతాలను వివరించారు. ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఎక్మోతో చిన్నారి ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు

- 11నెలల వయస్సులో ఎక్మోతో చికిత్స అత్యంత అరుదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యుమోనియాతో బాధ పడుతున్న 11 మాసాల ఓ పసిపాప ప్రాణాలను గచ్చిబౌలి కిమ్స్ కడల్స్ వైద్యులు కాపాడారు. ఆ చిన్నారికి లీడ్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ సుమన్ లింగాబత్తిన, కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ అలేఖ్యల నేతృత్వంలో ఎక్మో సపోర్టుతో వైద్యం అందించారు. చిన్నారికి అందించిన చికిత్సను వైద్యులు వివరించారు. "11 నెలల అన్విక అనే పాపకు హెచ్1ఎన్1 (స్వైన్ ఫ్లూ), న్యుమోనియా సోకింది. ఆమెను ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చగా వెంటిలేటర్ మీద పెట్టి చికిత్స చేశారు. అయినా ఆమెకు తగినంతగా ఆక్సిజన్ అందకపోతుండటంతో గచ్చిబౌలిలోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి పంపారు. వెంటనే పాపను ఎక్మో సపోర్టుతో సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాం. అలా ముందుగా 22 రోజుల పాటు ఎక్మో సపోర్టు పెట్టడంతో పాటు, మరో పది రోజులు ఐసియులో ఉంచి చికిత్స చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు పాప పూర్తిగా కోలుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి చేశాం" అని వైద్యులు తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో కొన్ని సంవత్సరాలుగా పిల్లలకూ ఎక్మో సపోర్ట్ అందిస్తున్నారు గాని, భారతదేశంలో మాత్రం ఇంకా అంతగా ఉపయోగంలోకి రాలేదు. పిల్లలకు ఎక్మో పెట్టడం చాలా సవాలుతో కూడుకుంది. ఇందుకు ప్రత్యేకంగా పీడియాట్రిక్ ఇంటెన్సివ్ వైద్యుల బృందం, సీనియర్ నర్సింగ్ బృందం, ఎక్మో పెర్ఫ్యూజనిస్టులతో పాటు.. అడ్వాన్స్‌డ్ ల్యాబ్ కేర్ సదుపాయాలు, పరికరాలు అవసరం. గచ్చిబౌలిలోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో ఈ సదుపాయాలన్నింటితో పాటు ప్రత్యేక వైద్యబృందం కూడా ఉండటంతో వైద్యులు పూర్తిస్థాయి నాణ్యమైన వైద్యం అందించగలిగారు.

బిఎస్‌సి నర్సింగ్ ప్రవేశాలకు ఆ నిబంధనను వెనక్కి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎస్‌సి నర్సింగ్‌లో 2023-24 విద్యాసంవత్సరంలో చేరాలంటే మేనేజ్‌మెంట్ ప్రవేశాలకు నీట్, ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలకు ఎంసెట్‌లో 50 శాతం మార్కులు ఉండాలన్న నిబంధనను వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కానీ 63 వేల ర్యాంకు వరకు విద్యార్థులకు మాత్రమే కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రవేశాల్లో అవకాశం కల్పించిందని తెలిపారు. దీనివల్ల ఎంసెట్‌లో అర్హత సాధించినా, వర్సిటీ నిర్ణయం వల్ల ఎంతోమంది విద్యార్థులకు నర్సింగ్ చదవాలని ఉన్నా అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఎంతో మంది విద్యార్థులు 63 వేల కంటే ఎక్కువ ర్యాంకు వచ్చినవాళ్లు ఉన్నారనీ, వర్సిటీ కోటాలో అవకాశం లేదని తెలిపారు. వాళ్ల భవిష్యత్తు కోసం కనీసం ప్రయివేట్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో సీటు కోసం వాటి చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. వర్సిటీ ఆమోదం లేకుండా తీసుకోలేమంటూ ప్రయివేట్ కాలేజీలు చెప్తున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ప్రయివేట్ కాలేజీల్లో భర్తీ కావాల్సిన సీట్లు 3,257 మిగిలే ఉన్నాయని గుర్తు చేశారు. రెండు విడతల కౌన్సెలింగ్ ప్రక్రియ అయ్యాక కూడా అన్ని సీట్లు మిగిలే ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత పొంది ర్యాంకు వచ్చిన విద్యార్థులకు అవకాశం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం తుదివిడత కౌన్సెలింగ్‌లో పర్సెంటైల్‌తో సంబంధం లేకుండా ఎపి తరహాలో ఎంసెట్ రాసి ఉత్తీర్ణత పొందిన వారందరికీ అవకాశమివ్వాలని కోరారు. ఏపీ ప్రభుత్వం మొదట 50 పర్సెంటైల్‌గా నిర్ణయించినా, తర్వాత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంసెట్ రాసిన అందరికీ అవకాశమిచ్చారని గుర్తు చేశారు. కానీ తెలంగాణలో ఇంతవరకు దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. యాజమాన్య కోటా సీటుకు నీట్‌లో అర్హత పొందడానికి 137 మార్కులు లేదా 50 పర్సెంటైల్ రావాలి అంటున్నారని పేర్కొన్నారు. మెడికల్ పీజీ సీట్లకే సున్నా పర్సెంటైల్‌కి ప్రవేశాలు కల్పించినపుడు బిఎస్‌సి నర్సింగ్‌కే ఆ నిబంధన ఎందుకని ప్రశ్నించారు. దాని వల్ల నర్సింగ్ చేయాలనే కోరిక ఉన్నా నీట్ అర్హత లేక విద్యాసంవత్సరాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నేటి నుంచి కాంగ్రెస్ విజయభేరి యాత్ర

- తాండూరులో ప్రారంభించనున్న డికె శివకుమార్
- రేపు సంగారెడ్డిలో ఖర్గే ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ రెండో దశ విజయభేరి యాత్రను చేపట్టనుంది. తాండూరు నియోజకవర్గంలో కర్నాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్ యాత్రను ప్రారంభించనున్నారు. తాండూరు, పరిగి, చేవెళ్ల నియోజకవర్గాల్లో వివిధ సభల్లో ప్రసంగించనున్నారు. చేవెళ్లలో మధ్యాహ్నం గంటపాటు ఆయన పాదయాత్ర చేయనున్నారు. అదేవిధంగా సంగారెడ్డి, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల్లో ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఆయానియోజకవర్గాల్లో కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన ప్రసంగించనున్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో, నవంబర్ 1, 2 తేదీకు సంబంధించిన షెడ్యూల్‌ను కాంగ్రెస్ పార్టీ విడుదల చేయనుంది. 31న కొల్లాపూర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను ఎఐసిసి అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనుంది. మొదటి దఫా విజయభేరి యాత్ర... ములుగులో ప్రారంభించి మహబూబాబాద్, భూపాలపల్లి, ఆర్మూర్ తదితర నియోజకవర్గాల్లో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ప్రచారం చేశారు.

కాంగ్రెస్ రెండో జాబితా విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా విడుదలైంది. 45 మందితో రెండో జాబితాను ఎఐసిసి శుక్రవారం విడుదల చేసింది. 55 మందితో ఇటీవల తొలి జాబితాను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య వందకు చేరింది. ఇంకా 19 నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. గద్దర్ కుమార్తె జివి వెన్నెలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీటు కేటాయించింది. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం నుంచి తుమ్మల నాగేశ్వరరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి కి రెండో జాబితాలో అవకాశం కల్పించారు.

మాడుగులపల్లిలో రైలు పట్టాలపై ఇరుక్కుపోయిన ట్రాక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైలు పట్టాలపై ట్రాక్టర్ నిలిచిపోవడంతో నల్గొండ జిల్లాలో శుక్రవారం పల్నాడు ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. మాడుగులపల్లికి చెందిన చెన్నయ్య ట్రాక్టర్‌లో కట్టెలు తీసుకుని పట్టాలపై నుంచి అవతలికి దాటేందుకు యత్నించాడు. ఇంతలో ట్రాక్టర్ ట్రాలీ చెరువుపల్లి వెళ్లే మార్గంలో పట్టాలపై ఇరుక్కుపోయింది. దీంతో స్థానికులు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. అదే సమయంలో పల్నాడు ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తోంది. ట్రాక్టర్ ట్రాలీ నిలిచిపోయిన విషయాన్ని అప్పటికే రైల్వే అధికారులకు తెలియజేయడంతో పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ను కుక్కడం రైల్వేస్టేషన్‌లో నిలిపేశారు. అనంతరం జెసిబితో ట్రాక్టర్‌ను తొలగించారు. రైలు ఆగిపోవడంతో అరగంట సేపు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

బిజెపి గెలిస్తే బిసి వ్యక్తిని సిఎం చేస్తాం

- కాంగ్రెస్, బిఆర్ఎస్ కుటుంబ పార్టీలు : అమిత్ షా



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే బిసి వ్యక్తికి సిఎంగా అవకాశమిస్తామని బిజెపి అగ్రనేత, కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తామని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న సిఎం కెసిఆర్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. శుక్రవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో బిజెపి నిర్వహించిన జనగర్జన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కుటుంబ పార్టీలని, ఎప్పటికీ తెలంగాణను అభివృద్ధి చేయలేవన్నారు. కెటిఆర్‌ను సిఎం చేయాలని కెసిఆర్, రాహుల్‌ను ప్రధానిని చేయాలని సోనియా అనుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాల కట్టుబడి ఉన్నామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలని కోరారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకుని వస్తే హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు రహదారిని ఆరు లైన్లుగా విస్తరింపచేస్తామని ప్రకటించారు. సభలో సూర్యాపేట, తుంగతుర్తి, భువనగిరి, నాగార్జునసాగర్, మహబూబ్‌నగర్ అభ్యర్థులు సంకినేని వెంకటేశ్వరావు, కడియం రామచంద్రయ్య, గూడూరు నారాయణరెడ్డి, నివేదితరెడ్డి, హుస్సేన్‌నాయక్, ఎమ్మెల్యే రాజాసింగ్, నాయకులు ప్రేమ్‌చందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, బొబ్బ భాగ్యరెడ్డి, బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

75వ ఐపిఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న అమిత్ షా

దేశ అంతర్గత భద్రత పరిరక్షణలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐపీఎస్ అధికారులు విరివిగా వినియోగించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ 75వ ఐపిఎస్ ట్రైనీ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటిని అరికట్టే విషయంలో ఎప్పటికప్పుడు పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక వ్యూహరచన చేసి అమలు పర్చాలని సూచించారు. ముఖ్యంగా వామపక్ష తీవ్రవాదం, టెర్రరిజంను ఎదుర్కోవడంలో దేశవ్యాప్తంగా పోలీసులు అనుసరిస్తున్న వ్యూహాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని ఆయన అన్నారు. వాటిని అరికట్టే విషయంలో నూతన ఎత్తుగడలను ఐపిఎస్ అధికారులు అనుసరించాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా ఇండోర్, అవుట్ డోర్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన యువ ఐపిఎస్ అధికారులకు అమిత్‌షా బహుమతులు, అవార్డులను ప్రదానం చేశారు. 75వ బ్యాచ్ శిక్షణా సమయంలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చిన అనుస్త కాలియా ప్రతిభాపురస్కారాన్ని హోంమంత్రి అమిత్‌షా అందజేశారు. ఎన్‌పిఎ డైరెక్టర్ అమిత్ గర్గ్ మాట్లాడుతూ 75వ బ్యాచ్‌లో 155 మంది దేశవాళీ ఐపిఎస్‌లుండగా, 20 మంది రాయల్ భూటాన్, మాల్దీవులు, నేపాల్ దేశాలకు చెందిన అధికారులున్నారని తెలిపారు. ఈ బ్యాచ్‌లో ఎనిమిది అధికారులు తెలంగాణకు, ఐదుగురు ఆంధ్రాకు కేటాయించబడ్డారని చెప్పారు. అంతకుముందు యువ ట్రైనీ ఐపిఎస్ అధికారులు శిక్షణాంతర ముగింపు కవాతు అత్యంత ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై తో పాటు పలువురు సీనియర్ ఐఎఎస్ అధికారులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నాయకుడు ప్రతిపక్షంలో ఒక్కరూ లేడు

- ఎన్నికల్లో పైసలు, మందు పంచను
- మంత్రి కె తారక రామారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విజన్ ఉన్న నాయకుడు ప్రతిపక్షంలో ఒక్కరూ లేడని, ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి ఏ క్షణంలోనైనా జైలుకు వెళ్లడం ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ అన్నారు. శుక్రవారం బిఆర్ఎస్ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ ఆత్మీయ సమ్మేళనంలో కెటిఆర్ మాట్లాడారు. 55 ఏళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రాష్ట్రానికి ఏం చేయలేదన్నారు. 2014లో మోడీ జన్ ధన్ యోజన ఖాతాలు తీస్తే రూ.15 లక్షలు ఖాతాల్లో వేస్తానని చెప్పి ఇప్పటి వరకు వేయలేదని విమర్శించారు. బండి సంజయ్.. మాట మాటకి మోడీని దేవుడని సంభోదిస్తుంటారని, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచినందుకా, ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇవ్వనందుకా దేనికి మోడీ దేవుడో చెప్పాలని ప్రశ్నించారు. ఒక్క వందే భారత్ రైలుకు వంద సార్లు జెండా ఊపిండని, సిరిసిల్లకు ఒక్క పవర్ లూమ్ క్లస్టర్ అడిగితే ఇవ్వలేదని, కనీసం బండి సంజయ్ ప్రయత్నమూ చేయలేదన్నారు. కాంగ్రెస్, బిజెపి పైసలు పంచాలని చూస్తున్నాయని, తాము మాత్రం ఎన్నికల్లో పైసలు, మందు పంచమని స్పష్టం చేశారు. సిరిసిల్ల దయతో తనకంటూ ఒక గుర్తింపు వచ్చిందని, సిరిసిల్ల రుణం తీర్చుకుంటానన్నారు. పాయలాగా ఉన్న మానేరు వాగులో ఇప్పుడు 365 రోజులూ నీళ్లు ఉంటున్నాయని, సజీవ జలధార మాదిరిగా మార్చింది కెసిఆర్ ప్రభుత్వం కాదా అని గుర్తు చేశారు. 400 కోట్లతో వర్కర్ టూ ఓనర్ షెడ్లు కడుతున్నామని, 375 ఎకరాల్లో అక్వాహబ్ ఏర్పాటు కాబోతుందని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తెస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమంలో సిరిసిల్ల గణనీయంగా మారిందన్నారు. ప్రజలు ఓటు అనే అస్త్రాన్ని వాడి మంచి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. 2014 ముందు సిరిసిల్ల ఎట్లా ఉండేదో, ఇప్పుడు ఎట్లా ఉందో పాత ఫోటోలు కొత్త ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేయాలని కోరారు. సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు సుంకపాక మనోజ్ సబ్బని హరీష్, సికిందర్, మున్సిపల్ కౌన్సిలర్లు, యువత పాల్గొన్నారు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళసై

దేశభవిష్యత్ యువత చేతుల్లో ఉంది

- గవర్నర్ తమిళిసైసౌందరరాజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. మన దేశం యువ దేశంగా అవతరించిదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో భారత ప్రభుత్వ నెహ్రూ యువక కేంద్ర సంఘటన్, కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సిఆర్‌పిఎఫ్, ఎన్ఎస్ఎస్, సిఎస్ఇ, నవోదయ విద్యాసంస్థలు తదితర సంస్థల ఆధ్వర్యంలో 'నామట్టి-నాదేశం' కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి మట్టి తెచ్చారనీ, అది ఢిల్లీలోని వార్ మెమోరియల్ నిర్మాణానికి ఉపయోగిస్తారని చెప్పారు. సర్ధార్ వల్లభాయ్ పటేల్ మూలంగానే దేశంలో హైదరాబాద్ విలీనమైందన్నారు. ఇప్పుడు తెలంగాణలో ఉందన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో సుభాష్ చంద్రబోస్ సేవలు గొప్పవనీ కొనియాడారు. బర్మా, సింగపూర్, మలేసియా దేశాల నుంచి జనాన్ని పోగేసి భారత్‌లో అడుగుపెట్టేటప్పుడు భారతీయుల రక్తతర్పణతోనే స్వాతంత్రం రావాలని కోరుకున్నారని చెప్పారు. దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. ప్రధాని నరేంద్రమోడీ దార్శనీతతో ముందుకు సాగుతున్నా మని వివరించారు. స్వాతంత్రోద్యమ కారుల చరిత్రలు చదవాలని పిలుపునిచ్చారు. దేశానికి ప్రజలంతా అంకితం కావాలని అభిప్రాయపడ్డారు. పారామిలిటరీ దళాలు దేశాన్ని కాపాడుతున్నాయని అన్నారు. సిఆర్‌పిఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ రవిదీప్‌సింగ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో నామట్టి-నాదేశం కార్యక్రమం నడుస్తోంద న్నారు. 75వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆజాదీకా అమృత్‌మహోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామాల నుంచి మట్టిని తెప్పించి ఢిల్లీలోని కర్తవ్య మార్గ్‌కు పంపిస్తున్నట్టు వివరించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడి త్యాగాలు చేసుకున్న వారి గురించి గుర్తుచేసుకోవాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. జాతీయ భావాలను బలోపేతం చేయడమే నామట్టి నాదేశం కార్యక్రమ ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ సౌత్ డైరెక్టర్ చారు సిన్హా తదితరులు పాల్గొన్నారు

పోటీ అనివార్యం

- యనమల,అచ్చెన్నాయుడుతో టిటిడిపి నేతల భేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తెలుగుదేశం పోటీ చేసే విషయంలో సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో శుక్రవారం పలువురు టిడిపి నేతలు జాతీయ నాయకత్వాన్ని కలిశారు. ఈ మేరకు పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర నాయకుల బృందం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్సీ అశోక్ బాబును కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి బరిలో నిలబడటానికి గతంలో కంటే సానుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. పార్టీ క్యాడర్‌ను కాపాడుకునేందుకు ఎన్నికల్లో పోటీ చేయడం అనివార్యమని చెప్పారు. పోటీలో ఉండకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో టిడిపి



పోటీలో ఉండటం లేదని మీడియాలో కథనాలు వస్తున్నాయని, దీంతో పార్టీ శ్రేణుల్లో ఇప్పటికే అయోమయం నెలకొందన్నారు. దీంతో యనమల, అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణ ఎన్నికల్లో పోటీకి సంబంధించిన అంశాలను పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారు. అన్ని స్థానాల్లో కాకుండా పార్టీకి బలమున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తే బాగుంటుందని వారు సూచించడం జరిగిందని నేతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య, ఎస్సి సెల్ అధ్యక్షుడు పొలంపల్లి అశోక్, బిసి సెల్ అధ్యక్షుడు శ్రీపతి సతీష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు మేకల భిక్షపతి, ప్రకాష్, రవీంద్రా చారి, నల్లగొండ పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

29న చంద్రబాబు మద్దతుగా 'కాన్సర్ట్'

చంద్రబాబుకు మద్దతుగా గచ్చిబౌలిలో ప్రత్యేక కాన్సర్ట్‌ను తెలుగు ప్రొఫెషనల్స్ నిర్వహించనున్నారు. హైటెక్‌సిటీ నిర్మించి 25 ఏళ్ల పూర్తవుతున్న నేపథ్యంలో చంద్రబాబుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చంద్రబాబు ద్వారా లబ్ధిపొందిన అందరూ ఈకార్యక్రమానికి ఆహ్వానితులేనని తెలుగు ప్రొఫెషనల్స్ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. కార్యక్రమం సాయంత్రం ఈనెల 29న(ఆదివారం) నాలుగు గంటలకు జిఎంసి బాలయోగి స్టేడియంలో ప్రారంభమవుతుందన్నారు.

ఎన్నికల కోడ్ తనిఖీల్లో..

- భారీ ఎత్తున బంగారం, నగదు పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు, బంగారాన్ని తరలిస్తున్న వారిని తనిఖీలు చేసి పట్టుకున్న ఘటనలు శుక్రవారం పలు జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద గల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.4.55 కోట్లు విలువ చేసే 6,986.30 గ్రాముల బంగారు నగలు పట్టుబడ్డాయి. గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ స్కార్పియో వాహనంలో సరైన ఆధారాలు లేకుండా ఆ నగలును తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీలో మధ్యాహ్నం వాహన తనిఖీలు చేపట్టగా జహంగీర్‌పీర్ దర్గా వైపు అనుమానాస్పదంగా స్కూటీపై వెళ్తున్న శ్రీనివాస శాస్త్రి అనే వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద రూ.ఏడు లక్షలు పట్టుబడ్డాయి. నగదుకు ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్టు సిఐ శంకర్‌రెడ్డి తెలిపారు. తాండూరు పట్టణంలో నిర్వహించిన తనిఖీల్లో శ్రీనివాస్ అనే వ్యక్తి వద్ద రూ.2.50 లక్షలు పట్టుకున్నట్టు సిఐ రాజేందర్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇన్నోవాలో తీసుకెళ్తున్న రూ.3లక్షలు నగదును పట్టుకున్నామని హెడ్ కానిస్టేబుల్ నాందేవ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ భగత్‌సింగ్ నగర్ ప్రాంతంలో సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.మూడు లక్షల నగదును పట్టుకున్నట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పరిధిలోని కాంటా ఏరియా సమీపంలో జరిగిన వాహన తనిఖీల్లో స్టేషన్ రోడ్డుకు చెందిన ఎండి రాజ్‌మొహమ్మద్ వద్ద పోలీసులు రూ. రెండు లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ బన్సీలాల్ తెలిపారు.



ప్రచారంలో 'పల్లా'కు నిరసన సెగ

- గ్రామ సమస్యలపై ఫ్లెక్సీ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో బిఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డికి నిరసన సెగ తగిలింది. శుక్రవారం గ్రామానికి ప్రచారం కోసం వెళ్లడంతో గ్రామస్తులు 26 అంశాలతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నర ఏళ్ల కెసిఆర్ పాలనలో స్థానిక ఎమ్మెల్యే గ్రామంలో ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని, కనీసం ఒక్కరికైనా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నా ఒక్క దళిత కుటుంబానికి భూమి ఇవ్వలేదని, గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు అయినాపూర్ నుంచి నడిచి వస్తున్నారని, మిషన్ భగీరథ నీళ్లు తాగే పరిస్థితి గ్రామస్తులకు లేదని పల్లాను నిలదీశారు. ఫ్లెక్సీలో ఏర్పాటు చేసిన సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ గతంలో ఉన్న ఎమ్మెల్యే ఏం చేశాడో తనకు తెలువదన్నారు. మరోసారి కెసిఆర్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత గ్రామానికి చేయాల్సిన పనులన్నీ చేస్తామని, ప్రచారానికి వచ్చిన అభ్యర్థిని నిలదీసే హక్కు గ్రామస్తులకు లేదని పల్లా సమాధానం చెప్పారు.

రాష్ట్రంలో విస్తరించిన ఉత్కర్ష్ ఎస్‌ఎఫ్‌బి

హైదరాబాద్ : రాష్ట్రంలో వ్యాపార కార్యకలాపాలను విస్తరించినట్లు ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. సికింద్రాబాద్‌లో నూతన శాఖను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దీంతో రాష్ట్రంలో నాలుగు శాఖలకు, దేశంలో 873 శాఖలకు చేరినట్లు వెల్లడించింది. నూతన శాఖను ఆ బ్యాంక్ తొలి ఛైర్మన్ వివిఎస్ సంపత్ లాంచనంగా ప్రారంభించారని పేర్కొంది.

రొమ్ము క్యాన్సర్‌పై ఎస్‌బిఐ లైఫ్ అవగాహన

హైదరాబాద్ : రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌బిఐ లైఫ్ పేర్కొంది. ఇందుకోసం 'థాంక్స్ ఎ డాట్' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అక్టోబర్‌ను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా పాటిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా రుతుక్రమ నొప్పి సమస్యకు పరిష్కారంగా మహిళలు ఎక్కువగా ఉపయోగించే 'హాట్ వాటర్ బ్యాగ్'ని ఉపయోగించడం ద్వారా స్వీయ రొమ్ము పరీక్షను ప్రోత్సహించడానికి అవగాహన పెంచే వర్కుషాప్‌లను చేపడుతున్నట్లు పేర్కొంది.

రిలయన్స్ బోర్డులోకి అంబానీ వారసులు

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డులోకి ఆ సంస్థ ఛైర్మన్ ముకేష్ అంబానీ పిల్లలు అయినా ఆకాశ్ అంబానీ, అనంత్ అంబానీ, ఈశా అంబానీలను తీసుకున్నారు. వీరిని డైరెక్టర్ల బోర్డులో చేర్చుకున్నట్లు ఆ సంస్థ శుక్రవారం తెలిపింది. గత నెలలో రిల్ వార్షిక సాధారణ సమావేశం (ఎజిఎం)లో ఈ విషయమై ముకేష్ అంబానీ ప్రకటన చేయగా.. తాజాగా వాటాదారుల నుంచి ఆమోదం లభించింది. ముగ్గురు వారసులకు కూడా గత కొన్ని ఏళ్లుగా రిలయన్స్ గ్రూపులోని కంపెనీల్లో కీలక బాధ్యతలను అప్పగించారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉన్న అంబానీ ముగ్గురు పిల్లలకు జీతాలు చెల్లించడం లేదని ఆ సంస్థ పేర్కొంది.

అందని ద్రాక్షగా దళిత బంధు

- ఎన్నికలొచ్చే ముందు హడావుడిగా లబ్ధిదారుల ఎంపిక
- ఎన్నికల కోడ్ పేరిట పక్కన పెట్టిన వైనం
- రెండేళ్లుగా ఆగిన ఎస్‌సి యాక్షన్ ప్లాన్
- స్వయం ఉపాది పథకాల్లేక యువత నిరీక్షణ
- కుటుంబాల్లో చిచ్చురేపిన పథకం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక న్యాయం, సామాజిక విప్లవమంటూ గొప్పలు చెప్పి ప్రారంభించిన దళిత బంధు పథకం అందని ద్రాక్షైంది. అదిగో ఇదిగో అంటూ రెండో దశలో అమలు చేయాల్సిన పథకాన్ని ఎన్నికలొచ్చేదాక పట్టించుకోలేదు. ఏడాదంతా కాలయాపన చేసి షెడ్యూల్ వచ్చే ముందు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియంటూ హడావుడి చేశారు. ఎమ్మెల్యేలకు కావాల్సిన వాళ్లతో జాబితా తయారు చేసి అధికారులకు పంపారు. తీరా ఎన్నికల షెడ్యూల్ రావడంతో గ్రౌండింగ్ ప్రక్రియ ఆగిపోయింది. ఒక్కో ఊర్లో కొందర్నే ఎంపిక చేసి ఇంకొందర్ని విస్మరించడంతో ఊరంతా ఒక్కటై మాకొద్దీ దళిత బంధు అంటూ ఆందోళనలు చేశారు. దళిత బంధు పథకం జపం చేస్తూ రెండేండ్లుగా ఎస్‌సి కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ కింద అమలు చేయాల్సిన సబ్సిడీ పథకాలన్నిటిని ఆపేశారు. ప్రభుత్వం ఇటు దళిత బంధు ఇవ్వక.. అటు కార్పొరేషన్ రుణాలూ ఇవ్వక దళితుల సంక్షేమానికి విరామం పలికింది. ఎన్నికల వేళ ఓట్ల కోసం బిఆర్ఎస్ అభ్యర్థుల్ని ఊర్లకెళ్తే దళితులంతా నిలదీస్తున్నారు.

దళితులంతా ఆర్థికంగా ఎదగడం ద్వారా సామాజిక స్టేటస్ పొందుతారని గొప్పలు చెప్పి దళితుల్ని మభ్యపెట్టడం తప్ప దళిత బంధు ఇచ్చిందిలేదు. దళిత బంధుతో ఎస్సి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. బీఆర్ఎస్ రెండో సారి అధికారంలోకి వచ్చాక ఎస్సి కార్పొరేషన్ సబ్సిడీ పథకాలకు మంగళం పాడింది. నిధుల్లేవనే పేరుతో 2020-21 వరకు అరకొర యూనిట్లు మంజూరు చేసినా సబ్సిడీ నిధుల్ని విడుదల చేయలేదు. కరోనా తర్వాత కార్పొరేషన్ రుణాలకు బదులు ప్రతి దళిత కుటుంబానికీ రూ.10 లక్షల చొప్పున ఇస్తామని ప్రకటించారు. కొత్త పథకం పేరిట పాత పథకాలకు స్వస్తి పలికిన ప్రభుత్వం కొత్త పథకాన్ని కూడా నిధుల్లేవన్న నెపంతో అమలు చేయకుండా కాలయాపన చేస్తూ వచ్చింది.

పేరుకే పది లక్షలు.. మిగిలిందేమీలేదు

సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో 11 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. తొలి దశలో దళిత బంధు పథకాన్ని నియోజకవర్గంలో వంద మంది లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో 444 యూనిట్లను రూ.44.4 కోట్లతో గ్రౌండింగ్ చేశారు. మెదక్ జిల్లాలో 180 యూనిట్లు, సిద్దిపేట జిల్లాలో 380 యూనిట్ల వరకు గ్రౌండింగ్ చేశారు. లబ్ధిదారులకు ఎలాంటి నైపుణ్య శిక్షణ ఇవ్వకుండా తోచిన యూనిట్లను మంజూరు చేసి అప్పజెప్పారు. గొర్రెలు, గేదెలు, ట్రాక్టర్లు, కార్లు, వరికోత యంత్రాలు, ఇతర వాహనాల్ని ఇచ్చారు. గేదెలు, మేకలు, గొర్రెలొచ్చిన లబ్ధిదారులు వాటిని పెంచలేక సగం ధరకే అమ్ముకున్నారు. వాహనాలను ఊర్లల్లో నడిపేందుకు వీల్లేక తక్కువ ధరకు అమ్ముకున్నారు. పేరుకు రూ.పది లక్షలు ఇచ్చినట్లే కానీ..! రూ.ఐదు లక్షలు కూడా మిగల్లేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా లబ్ధిదారుల జాబితాలో పేరు పెట్టించామనే పేరుతో స్థానిక నాయకులు రూ.రెండు లక్షలు వసూలు చేశారు. ఒక కీలకమైన మంత్రి నియోజకవర్గంలోనే ఒక్కో యూనిట్‌కు లక్ష నుంచి రెండు లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలొచ్చాయి. దళిత బంధు పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారంటూ సిఎం కెసిఆర్ ఎమ్మెల్యే సమావేశంలోనే ప్రస్తావించారు.

చేతికందని రెండో దశ

రెండో దశలో ప్రతి నియోజకవర్గానికి 1100 యూనిట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఏడాదంతా అదిగో ఇదిగో అంటూ దళితుల్ని మభ్య పెట్టారు. ఎమ్మెల్యేలే లబ్ధిదారుల్ని ఎంపిక చేస్తారన్న పేరుతో వాళ్ల చుట్టూ తిప్పుకున్నారు. సెప్టెంబర్‌లో దళిత బంధు రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. స్థానిక ప్రజాప్రతినిధులు తమకు నచ్చిన ఊర్ల నుంచి నచ్చిన దళితుల పేర్లను ఎమ్మెల్యేలకు ప్రతిపాదించారు. అట్టి పేర్లను ఒకటికి రెండు సార్లు పరిశీలించి బీఆర్ఎస్‌కు సహాకరించే వాళ్లే అన్న నమ్మకం వచ్చాకనే జాబితాల్ని కలెక్టర్ ఆమోదం కోసం పంపారు. సంగారెడ్డి, దుబ్బాకలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్నందున అక్కడ బీఆర్ఎస్ నాయకులే జాబితాల్ని తయారు చేసి కలెక్టర్లకు పంపారు. 11 నియోజకవర్గాల్లో 12,100 మంది లబ్ధిదారుల్ని ఎంపిక చేసి ఎంపీడీఓలకు జాబితా ఇచ్చారు. ఆ జాబితాలో పేర్లున్న లబ్ధిదారుల నుంచి ఆధార్, రేషన్‌కార్డు, ఫొటోలతో పాటు ఏ యూనిట్ పెట్టుకుంటారనే వివరాల్ని పంచాయతీ కార్యదర్శులు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వాళ్లందరికీ చెక్కులు తయారవుతున్నాయని చెప్పి ఊరించారు. ఎన్నికల కోడ్ రావడంతో ఏ ఒక్కరికీ యూనిట్ గ్రౌండింగ్ కాలేదు. ఊర్లల్లో కొందరికే దళిత బంధు మంజూరు కావడంతో దళిత వాడల్లో తగువులొచ్చాయి. రానివాళ్లంతా వచ్చిన వాళ్లతో గొడవకు దిగారు. ఊరంతా ఒక్కటై ఆందోళనలు కూడా చేశారు. దళిత బంధు పథకం దళిత కుటుంబాల మధ్య చిచ్చు రగిల్చి ఉన్న బంధాల్ని దెబ్బతీసింది. ఒకే ఇంట్లో అన్నదమ్ముల మధ్య కూడా గొడవలు జరిగాయి.

ఆగిన ఎస్సి కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్

దళిత బంధు పథకానికి ముందు ప్రతి జిల్లాలో ఎస్సి కార్పొరేషన్ ద్వారా ప్రతి ఏటా యాక్షన్ ప్లాన్ కింద సబ్సిడీ రుణాలిచ్చేది. పట్టుమని పది మందికి దళిత బంధు ఇవ్వని ప్రభుత్వం ఆ పేరుతో వేలాది మందికి కార్పొరేషన్ రుణాల్ని ఆపేసింది. 2020-21 యాక్షన్ ప్లాన్ కింద సంగారెడ్డి జిల్లాలో నైపుణ్యం కల్గిన 302 మందికి, నైపుణ్యంలేని 238 మందికి రుణాలివ్వాలని ఎంపిక చేశారు. రూ.10.21 కోట్ల సబ్సిడీ నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎస్‌సి కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ కింద ప్రతి ఏటా యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలివ్వాలి. బ్యాంకు అనుబంధ రుణాలు పొందితే లక్ష రుణానికి 80 శాతం సబ్సిడీ, రెండు నుంచి రూ.పది లక్షల వరకు రుణం పొందితే 60 శాతం సబ్సిడీ ఇచ్చేది. వ్యవసాయ అనుబంధంగా దళిత రైతులకు బోరు బావులు, పంపుసెట్ల కోసం రుణాలిచ్చేది. అంతకు ముందు భూమి కొనుగోలు పథకం అమలయ్యేది. ఇవేవీ ఇప్పుడు కార్పొరేషన్ ద్వారా బడ్జెట్ రాకపోవడంతో అమలు కావడంలేదు.

ఎన్నికల స్టంట్: అకోశ్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు

ఎన్నికల స్టంట్‌లో భాగంగా దళిత బంధు పథకం పేరిట ఊరించారు. రెండు దశల్లో అమలు చేయాల్సిన దళిత బంధు పథకాన్ని కావాలనే కాలయాపన చేశారు. అన్ని కుటుంబాలకు ఇస్తామన్న ప్రభుత్వం కొందర్నే ఎంపిక చేయడం వల్ల దళితుల్లో చిచ్చు పెట్టినట్టైంది. కార్పొరేషన్ రుణాలకు నిధులివ్వడంలేదు. ఊర్లకు వస్తే ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు.

మున్సిపల్ ఉద్యోగ, కార్మికులకు మీరేం చేస్తారు?

- అన్ని పార్టీలూ మ్యానిఫెస్టోల్లో పెట్టండి
- సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారంలోకి వస్తే మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఏం మేలు చేస్తారనే విషయాన్ని అన్ని పార్టీలూ తమ మ్యానిఫెస్టోల్లో పొందుపర్చాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టిపిసిసి అధ్యక్షులు ఎ రేవంత్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కెటిఆర్‌కు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులకు వినతిపత్రాలను అందజేసింది. రాష్ట్రంలోని 2 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 142 మున్సిపాలిటీల్లో సుమారు 65 వేల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్-పే తదితర పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఆందోళనలు, సమ్మెలు, ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. ఎన్నికల సందర్భంలో హామీలిచ్చి విస్మరించడం గత ప్రభుత్వాలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలను తమ పార్టీల మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా నర్సింహులు, రాష్ట్ర కార్యదర్శి పి సుధాకర్, ఎం శ్రావణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఆర్ వాణి, డి కిషన్, గుర్రం అశోక్, మహిళా కన్వీనర్ వి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ సభకు వెళ్తుండగా ట్రాక్టర్ బోల్తా

- మహిళా మృతి.. పది మందికిపైగా గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సిఎం కెసిఆర్ ప్రజా ఆశీర్వాద సభకు వస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఒక మహిళ మృతి చెందారు. పది మందికి పైగా గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గైగొళ్లపల్లి గ్రామానికి చెందిన 20 మంది కెసిఆర్ సభకు ట్రాక్టర్‌పై బయలుదేరగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి మండలంలోని నాన్ తండా దగ్గర రోడ్డు పక్కన ఉన్న వరి పొలంలో బోల్తా పడింది. ట్రాక్టర్ ట్రక్కు తిరగలపడటంతో వరి పొలంలో జనం కూరుకుపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ట్రాక్టర్‌ను వెంటనే పైకి లేపి జనాలను బురదలో నుంచి ఒడ్డుకు తీసుకువచ్చారు. అల్లి అనసూర్య (55) అక్కడికక్కడే మృతి చెందారు. సుమారు పదిమందికి కాళ్లకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 ద్వారా ఖమ్మం ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

చనిపోయిన మహిళ కుటుంబానికి రూ. 50లక్షలు ఇవ్వాలి : పొంగులేటి

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన బాధాకరమని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంఘటనకు సిఎం కెసిఆర్, బిఆర్ఎస్ పార్టీ నైతిక బాధ్యత వహించాలన్నారు. చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ. 50 లక్షలు, గాయపడిన వారికి రూ. పది లక్షల చొప్పున పార్టీ తరుపున ఆర్థిక సాయం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి వస్తే ఉచిత విద్య : కిషన్‌రెడ్డి

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య అందిస్తామనీ, పంట బీమా అమలు చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత కేఎస్.రత్నం ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జీకేఆర్ మాట్లాడుతూ.. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్‌పార్టీ కర్నాటకను భ్రష్టు పట్టించిందని విమర్శించారు.

కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచుడే : రాజీవ్ సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్‌ను నమ్మితే ప్రజల్ని నట్టేట ముంచుతుందని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు.ఆ పార్టీ ఇచ్చే అబద్ధపు హామీలతో కర్ణాటక రైతులు అరిగోస పడుతున్నారని తెలిపారు. రైతులను నరకయాతన పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఏ ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోనందుకు ముందు కర్ణాటక రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

సమ్మె హామీలు అమలు చేయాలి

- మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండవ ఎఎన్ఎంలు, ఇసిఎఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ఎఎన్ఎంలు, వైద్య విధాన పరిషత్ ఎఎన్ఎంలు, హెచ్ఆర్డిఎఎన్ఎంలు, ఇతర అన్ని రకాల ఎఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియుద్దీన్, కె యాదానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ హామీల అమలు కోసం, తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం పిహెచ్‌సి, యుపిహెచ్‌సిల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

వన్‌డే.. టూ వికెట్స్ డౌన్

బ్యాక్ టూ పెవిలియన్ బాటలో మరికొందరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపిలో రోజుకో కీలక వికెట్ పడిపోతోంది. శుక్రవారం ఒక్కరోజే రెండు ముఖ్యమైన వికెట్లు పడ్డాయి. అచ్చిరాని మైదానం (ఎన్నికల గోదా)లోకి దిగి పరుగులు తీయలేక ఇబ్బంది పడటం ఇబ్బంది ఎందుకు అనుకుంటున్నారో ఏమోగానీ ముందే బ్యాక్ టూ పెవిలియన్ బాట (మళ్లీ సొంతగూళ్లకు) పట్టేందుకు సిద్ధం అవుతున్నారు.

రైతు బాంధవుడు 'బోడేపూడి'

- నీతి, నిజాయితీకి మారుపేరు
- మూడు దఫాలుగా విజయం
- వెంకటేశ్వరరావు లాంటి వారు సభలో ఉండాలనేది ప్రజల ఆకాంక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు పండించిన పంటలకు సాగు నీరందించేందుకు అహర్నిశలు కృషి చేసి తన జీవితాన్ని ప్రజా సమస్యల పరిష్కారం కోసం అంకితం చేసిన కమ్యూనిస్టు యోధులు బోడేపూడి వెంకటేశ్వరరావు. 1985 నుంచి 1994 వరకు వరుసగా మూడుసార్లు ఖమ్మం జిల్లా మధిర ఎమ్మెల్యేగా బోడేపూడి వెంకటేశ్వరరావు విజయం సాధించారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం మరణించే వరకు ప్రజా సేవలోనే తన జీవితాన్ని గడిపారు. 1985, 1989, 1994లలో జరిగిన ఎన్నికలలో బోడేపూడి విజయం సాధించారు. అంతకుముందు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు విజయం సాధించారు. కానీ మధిర నియోజకవర్గ అభివృద్ధి బోడెపూడి వచ్చిన దగ్గర నుంచే ప్రారంభమైంది. ఆయన మధిర ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గర నుంచే ఈ ప్రాంతం అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయాలలో బోడెపూడి ఎమ్మెల్యేగా, సిపిఎం శాసనసభ పక్ష నాయకులుగా వ్యవహరించారు. ఆయన అసెంబ్లీ సమావేశాలలో ప్రజా సమస్యలనే ప్రస్తావించేవారు. ఎమ్మెల్యే అంటే ఎలా ఉండాలో ఆచరణలో చూపించారు. శాసనసభలో నందమూరి తారక రామారావుకు, కాంగ్రెస్‌కు మధ్య వాదోపవాదాలు జరిగిన సమయంలో ఆ రెండు పార్టీల నేతలు బోడెపూడి వెంకటేశ్వరరావు చెప్పిన సూచనలకు కట్టుబడి ఉండేవారు. ఆ విధంగా శాసనసభలో ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి సంధానకర్తగా వ్యవహరించి ప్రజా నాయకుడిగా పేరు సంపాదించారు. మధిర నియోజకవర్గ సమస్యలపై మాట్లాడుతున్న సమయంలో ఎన్‌టిఆర్, చంద్రబాబు వెంటనే స్పందించేవారు. బోడెపుడి ప్రస్తావించిన అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను వారు వెంటనే ఆదేశించేవారు. శాసనసభలో తన వాగ్ధాటితో మధిర నియోజకవర్గ అభివృద్ధికి పునాదులు వేశారు.

రైతు బాంధవుడు బోడెపూడి

ఆనాడు ప్రభుత్వం రెండు మంచినీటి పైలెట్ ప్రాజెక్టులను మంజూరు చేయగా అందులో మధిర నియోజకవర్గం ఉండటం విశేషం. మధిర నియోజకవర్గ ప్రజలు మంచినీటి సమస్యతో ప్రధానంగా ఫ్లోరైడ్ నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శాసనసభలో బోడెపూడి ప్రస్తావించారు. ఫ్లోరైడ్ మంచినీటిని తాగటం వల్ల కాళ్లు వాపులు వస్తున్నాయని స్వయంగా తన కాళ్లను శాసనసభలో చూపించారు. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి మధిర నియోజకవర్గానికి మంచినీటి పైలెట్ ప్రాజెక్టును మంజూరు చేసి, వెంటనే నిర్మాణ పనులనూ ప్రారంభించింది. మధిరలో ఆనాడు ఎర్రుపాలెం, మధిర, బోనకల్, వైరా, తల్లాడ మండలాలు ఉన్నాయి. ఈ మండలాలకు ప్రధాన కేంద్రంగా వైరా ఉండటంతో వైరా చెరువులో పైలెట్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి ఈ నియోజకవర్గంలోని 104 గ్రామాలకు మంచినీటి సరఫరా చేశారు. బోడెపుడి మరణాంతరం మంచినీటి పైలెట్ ప్రాజెక్టుకు బోడేపూడి సుజల స్రవంతి పథకంగా నామకరణం చేశారు. నియోజకవర్గంలో సాగు నీటి సమస్య ఏర్పడినప్పుడు మధిర రైతులు అధికారులకు కాకుండా బోడేపూడికే ఫోన్ చేసేవారు. ఇంటికి వెళ్లి రైతుల తమ గోడును వివరించేవారు. సమస్యలు విన్న వెంటనే కాలువల మీద పర్యటించి, వయసు మీద పడినా లెక్కచేయకుండా రైతుల కోసం రాత్రి, పగలు అనే తేడా లేకుండా సాగర నీటిని విడుదల చేయించడంలో పంటలను కాపాడటంలో ఆయన నిర్విరామంగా కృషి చేశారు. ఆయన ఎక్కువగా రైతులతోనే గడిపారు. బోడెపూడికి రైతు బాంధవుడుగా నామకరణం చేశారు. అంతర్గత రోడ్లు, రోడ్ల ఫార్మేషన్, సాగు, తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రధాన భూమిక వహించారు. ఈ ప్రాంతంలో ఆనాడు అనేక గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేదు. కరెంటు సమస్య తీవ్రంగా ఉండేది. ఆయన ఎమ్మెల్యే కాగానే ప్రధానంగా రోడ్ల సమస్య, కరెంటు సమస్య, సాగునీటి, తాగునీటి సమస్య పరిష్కారం చేసి నియోజకవర్గ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు. జన్మభూమి కార్యక్రమం సందర్భంగా బోనకల్ మండలం ముష్టికుంట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో స్వయంగా ఆనాటి సిఎం చంద్రబాబు పాల్గొన్నారు.

సిపిఎం నిబంధనలకు కట్టుబడే..

సిపిఎం నిబంధనలకు కట్టుబడి తూచ తప్పకుండా పాటించేవారు. ఏ సమస్య వచ్చినా పార్టీ నిబంధనలకు లోబడే పని చేసేవారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నా దానిని ప్రజల కోసమే ఉపయోగించారు. ఆడంబరాలకు పోకుండా సాధారణ జీవితాన్ని గడేపేవారు. మధిర నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి నేటికీ ప్రజా హృదయాలలో ఆయన నిలిచిపోయారు. సాగర్ నీరు అనగానే రైతులందరికీ గుర్తుకు వచ్చేది నేటికీ బోడెపూడి వెంకటేశ్వరరావు కావడం విశేషం. రైతులు సాగర నీటి సమస్య రాగానే బోడెపూడి లేకపోవడం వల్లే మనకి ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడిందని, అదే బోడెపూడి ఉంటే ఈ సమస్య ఉండేది కాదని రైతులు స్మరించుకుంటున్నారంటే ఆయన రైతులకు ఏ విధంగా సేవలు చేశారో మనకు అర్థం అవుతుంది. అటువంటి నాయకుడు ఉండాలని రైతులు, ప్రజలు కోరుకుంటున్నారు.

జానపద కవి కొసరాజు సమగ్ర సాహిత్యం తానా ప్రచురణ

ప్రజాశక్తి - కల్చరల్

సుమారు నాలుగు దశాబ్దాలు పైగా తెలుగు సినీ రంగంలో 'ఏరువాక సాగారో, రామయ తండ్రీ ఓ రామాయ తండ్రీ, అడుతు పాడుతు పని చేస్తుంటే,' వంటి పలు గీతాలు జానపద శైలిలోను అచ్చమైన తెలుగు నుడికారంతో రాసిన కొసరాజు రాఘవయ్య సమగ్ర సాహిత్యాన్ని సేకరించి గ్రంథ రూపంలో వెలువరించేందుకు సన్నాహం చేస్తున్నామని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వహకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర ఒక ప్రకటనలో తెలిపారు. అయనతో కలసి తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు కలసి కొసరాజు సినీ పాటలే కాక గండికోట యుద్ధం కావ్యం, కడగండ్లు, నవ భారతం, భాను గీత వంటి పద్య నిఘంటులు యక్ష గానం వంటి వివిధ ప్రక్రియలో ప్రతిభావంతులని సమగ్ర సాహిత్య గ్రంథంలో ఆయన రచనలతో పాటు జీవిత విశేషాలు ఉంటాయని వారు తెలిపారు. గతంలో ప్రముఖ కవి సిరివెన్నెల సీతారామ శాస్త్రి సమగ్ర సాహిత్యాన్ని ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో అరు సంపుటాలుగా సాహిత్య అభిమానులకు అందిచామని వారు ఆ ప్రకటనలో వివరించారు. గ్రంథ ప్రచురణకు సహకారం అందిస్తున్న కొసరాజు కుటుంబ సభ్యులకు మనసు ఫౌండేషన్ అశోక్ కుమార్ పారాకు ధన్యవాదాలు తెలిపారు.



సంస్కృతి అన్ని కళల సమాహారం

ప్రజాశక్తి - కల్చరల్

సంస్కృతి అన్ని కళల సమాహారమనీ పిల్లలు పద్యాలు నేర్చుకోవటం సంస్కృతి పరిరక్షణలో భాగ మనీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సత్కళా భారతి 27 వార్షిక వేడుకలు సందర్భంలో ఇటీవల నిర్వహించిన కార్టూన్ పోటీల విజేతలకు భాగవత పద్య గాన పోటీలలో విజేతలైన పిల్లలకు బహుమతి ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని మాట్లాడుతూ పద్యం తెలుగు వారి సంపద అన్నారు. పిల్లలకు పద్యాలు నేర్పించటం వల్ల వారికి సత్ప్రవర్తన నేర్పినట్లు అన్నారు అధ్యక్షత వహించిన ప్రముఖ గాయకుడు నేమాని పార్థసారథి మాట్లాడుతూ పద్యాలలో నీతి దాయక సూక్తులు ఉంటాయన్నారు. నేటి తరంలో పద్యాల కంటే చదులలో రాంకులకే ప్రాధాన్యత ఇవ్వటం వల్ల వారిలో ఆత్మ విశ్వాసం కొరవడిందని అన్నారు. ఆకాశవాణి సంచాలకుడు ఉదయ శంకర్ మాట్లాడుతూ ఆకాశవాణిలో కొత్త ప్రయోగాలకు పలు నిబంధనలు అడ్డు వస్తాయని ఐనప్పటికీ పిల్లలలో పద్యాలు పట్ల ఆసక్తి పెంచేందుకు ఒక కార్యక్రమాన్ని రూపకల్పన త్వరలో చేస్తామని ప్రకటించారు. సంస్థ స్థాపకుడు సత్యనారాయణ సంస్థ లక్ష్యాలు వివరించారు. వేదికపై న్యాయ నిర్ణేతలు సిహెచ్ మృత్యుంజయ, పి దక్షినా మూర్తి పాల్గొని విజేతలను ప్రకటించారు.

Dr.Reddy's

రాణించిన డాక్టర్ రెడ్డీస్

- అంచనాలు మించి రాబడి

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 33 శాతం వృద్ధితో రూ.1,482 కోట్ల నికర లాభాలు సాధించింది. నిపుణుల అంచనాలు మించి ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. రూ.1,269 కోట్ల లాభాలు చోటు చేసుకోవచ్చని ఎల్ఎస్ఇజి డేటాలో నిపుణులు అంచనా వేశారు. అమెరికాలో క్యాన్సర్ డ్రగ్ బలమైన అమ్మకాలు ఆర్థిక ఫలితాలకు మద్దతునిచ్చాయి. గడిచిన త్రైమాసికంలో కంపెనీ స్థూల రెవెన్యూ 9 శాతం పెరిగి 6,110 కోట్లుగా చోటు చేసుకుంది. అమెరికాలో అమ్మకాలు 13 శాతం వృద్ధితో రూ.3,170 కోట్లుగా, భారత్‌లో 3 శాతం పెరిగి రూ.1,190 కోట్లుగా నమోదయ్యాయి. మరో త్రైమాసికంలోనూ మెరుగైన ఆర్థిక ఫలితాలు సాధించామని ఆ సంస్థ కో ఛైర్మన్ జివి ప్రసాద్ పేర్కొన్నారు. ఇంతక్రితం ఎప్పుడూ లేని స్థాయిలో అమ్మకాలు, లాభాలు నమోదు చేశామన్నారు.

యూరప్ రెవెన్యూ కూడా 26 శాతం పెరిగి రూ.530 కోట్లుగా చోటు చేసుకుందని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. వర్ధమాన మార్కెట్ల నుంచి రూ.1220 కోట్ల వ్యాపారం నమోదయ్యిందని తెలిపింది. శుక్రవారం బిఎస్ఇలో ఆ కంపెనీ షేర్ 0.72 శాతం తగ్గి రూ.5,385 వద్ద ముగిసింది.

మారుతి సుజుకి రికార్డ్ లాభాలు..

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో రికార్డ్ స్థాయిలో రూ.3,764.2 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. కమోడిటీ ధరలు తగ్గడానికి తోడు వ్యయాలు దిగిరావడం, విదేశీ మారకం సానుకూలతలు తదితర అంశాలు ఆకర్షణీయ ఫలితాలకు మద్దతునిచ్చాయని ఆ సంస్థ తెలిపింది. దేశీయంగా కార్ల అమ్మకాలు 6.3 శాతం పెరిగి 4,82,731 యూనిట్లుగా నమోదయ్యాయి. ఎగుమతులు 9.7 శాతం వృద్ధితో 69,324 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. కంపెనీ మొత్తం ఆదాయం 24.1 శాతం పెరిగి రూ.30,541 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం వ్యయం 18.6 శాతం పెరిగి రూ.27,925 కోట్లుగా నమోదయ్యింది.

ఎయిర్‌టెల్ వన్‌వెబ్‌తో శాటిలైట్ ఇంటర్నెట్

న్యూఢిల్లీ : దిగ్గజ టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ దేశంలో వన్‌వెబ్ పేరుతో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ అధినేత సునిల్ భారతి మిట్టల్ ఢిల్లీలో జరిగిన 7వ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ఇప్పుడు కొత్త టెక్నాలజీ అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశంలోని ప్రతి అంగుళంలో సేవలు అందించేందుకు శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థను ఆవిష్కరించామన్నారు. వచ్చే నెల నుంచి మెహసానా శాటిలైట్ గ్రౌండ్ స్టేషన్ నుంచి సేవలు అందుతాయని సునిల్ మిట్టల్ తెలిపారు. ప్రపంచ దేశాలకు కూడా మన శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ చేరుకుంటోందన్నారు. జిఎస్ఎల్‌వి మాక్ 3 రాకెట్లను ఇస్రో ప్రయోగించిందని, ఆ రాకెట్ ద్వారా 72 ఉపగ్రహాలను నింగిలోకి పంపామని, వన్‌వెబ్ కాన్‌స్టెల్లేషన్‌లోనూ భారతి కంపెనీ వాటా ఉందన్నారు. దీంతో ప్రపంచానికి సేవలు అందించడానికి రెడీగా ఉన్నామన్నారు.

ఎట్టకేలకు మార్కెట్లకు ఉపశమనం

- సెన్సెక్స్‌కు 635 పాయింట్ల లాభం

ముంబయి : వరుసగా ఆరు సెషన్లలో భారీ నష్టాలు చవి చూసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు వారాంతంలో ఎట్టకేలకు ఉపశమనం లభించింది. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 635 పాయింట్లు పెరిగి 63,783కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 190 పాయింట్లు రాణించి 19.047 వద్ద ముగిసింది. ఆసియా, ఐరోపా మార్కెట్లలోని సానుకూలతలకు తోడు ఇప్పటికే పడిపోయిన సూచీల నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. హెచ్‌సిఎల్ టెక్, అదాని ఎంటర్‌ప్రైజెస్, యాక్సిస్ బ్యాంక్, కోల్ ఇండియా, ఎస్‌బిఐ, టాటా మోటార్స్, ఐచర్ మోటర్స్, ఒఎన్‌జిసి, ఎన్‌టిపిసి తదితర స్టాక్స్ 1.5 శాతం నుంచి 3 శాతం మేర పెరిగి మార్కెట్లకు మద్దతును ఇచ్చాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.7 శాతం, 1.9 శాతం చొప్పున రాణించాయి. పిఎస్‌యు బ్యాంకింగ్ రంగం 4 శాతం, మీడియా 2.6 శాతం, రియాల్టీ సూచీ 1.9 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్-30లో 27 సూచీలు రాణించాయి.